చిక్కులు వున్నాయి. అందుకే చెక్కులు ఫైనాన్స్ కంటే ఇవ్వరు'' చిరునవ్వుతో చెప్పాడు ఏజెంటు.

''నేను డబ్బు ఆపకుండా కడ్తాను అని సెప్పాను కదయ్యా''

''నీవు చెప్పేది నిజమే! కాని 'నిజం' అన్న గ్యారెంటీ ఏమిటి? ఈ కాలంలో ఎవడు మంచోడో, ఎవడు చెడ్డోడో తెలియడం లేదు. మనం 'నిజం' చెప్తే దానిని ఇతరులు 'అబద్ధం' అనుకోవడం ఎంత సమంజసమో, 'అబద్ధం' చెప్పినప్పుడు దానిని 'నిజం' అనుకోవడం అంతే సహజం. అందుకే ఈ కాలంలో మోసం చేసేవాడు తేలికగానే బాగుపడ్తున్నాడు. నష్టపోయేది, నిజం చెప్పి ధర్మంగా నడవాలనుకున్నవాడే కదా! ఇదంతా ఎందుకొచ్చిన గొడవ అని బ్యాంకులేమో, చెక్కులు ఇవ్వకుండా జాగ్రత్త పడుతున్నాయి. ఎంత జాగ్రత్తపడ్డా తెలివుంటే మార్గాలు అనేకం.. ఏమంటావ్?'' అన్నాడు గర్వంగా.

కథ ఇక్కడివరకు అర్థమైన రంగయ్యకు ఒక్క విషయం మాత్రం అర్థం కాలేదు.

ఈ మాయదారి డబ్బున్న గొప్పోళ్ళు మాటలు నేర్చి తెలివి మీరాక ఇలా గొప్పోళ్ళయ్యారా...లేక డబ్బు వచ్చి గొప్పోళ్ళయ్యాక మాటలు నేర్చారా! అన్నది అర్థంకాక ఆలోచిస్తూ ఉండిపోయాడు రంగయ్య.

-రోషన్ మొగల్ (నెల్లూరు)

# నిజాయితీ

ఎదురింటి మీనాక్షమ్మకి నేనంటే కొంచెం కోపం. కారణం పెద్దగా ఏమీలేదు. నేను ఉద్యోగం చేస్తూండటం వల్ల రోజూ పొద్దున్న తొమ్మిది గంటలకల్లా తయారయి ఆఫీసుకు వెళ్ళటం, మళ్ళీ సాయంత్రం ఆరు గంటలదాకా రాకపోవటం, అప్పటికే నేను అలసిపోయి వుండటం, మళ్ళీ ఇంట్లో పనులు ఎదురుచూస్తూ వుండటంతో ఆవిడ వాకిట్లోనే పలకరించినా నేను ముక్తసరిగా మాట్లాడి ఇంట్లోకొచ్చేస్తాను. అంతే.


మాది కొత్తకాలనీ. మా వీధిలో ఎక్కువ ఇళ్ళు లేవు. అందుకే మీనాక్షమ్మగారిలాంటి కబుర్ల పోగులకు కాలక్షేపం కావటం కష్టం. కబుర్లు చెప్పకపోతే కడుపంతా దేవేసినట్లు నానా బాధాపడిపోతుంది ఆవిడ. ఎక్కడెక్కడి కబుర్లూ కామా, ఫుల్‌స్టాఫ్ లేకుండా ఎదుటివాళ్ళను ఆకట్టుకునేటట్లు చెప్పే నేర్పరి.

నేనెంత కాదనుకున్నా అప్పుడప్పుడన్నా నా మనసు ఆవిడ కబుర్ల వైపు ఆకర్షింపబడుతుంది. అలాంటి సమయాల్లో ఈమధ్య ఆవిడ కబుర్లలో తరచూ వస్తున్న టాపిక్, దొంగతనాలు.

"ఈమధ్య కాలనీలో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. దొంగలు పగటిపూట కూడా కాలనీలో రకరకాల వేషాల్లో తిరుగుతున్నారుట. సరుకులమ్ముకునేవాళ్ళు, కాయితాలేరుకునేవాళ్ళు, బిచ్చగాళ్ళు. అమ్మో ఎవర్నీ నమ్మటానికి లేదు" గోరంతలు కొండంతలు చేస్తోందా అనిపించింది.

"మీరేమో ఇంట్లోనే వుండరు. ఉన్నా, లోపలేం చేస్తుంటారో ఏమో కాని వీధి మొహం చూడరు. మన వీధిలో ఈమధ్య ఎవరెవరో కొత్తవాళ్ళు తిరుగుతున్నారు. పగలంతా నేనొక్కదాన్ని...భయం వేస్తూంటుంది" సమాచారంతోపాటు తన అక్కసు కూడా వెళ్ళగక్కింది మీనాక్షమ్మ ఒకరోజు.

"అయినా మధ్య మధ్యలో వాకిట్లోక్కూడా చూస్తూం



డాలి, వీధిలోకి కొత్తవాళ్ళెవరన్నా వస్తున్నారేమోనని."

మీనాక్షమ్మగారి మాటలు నిజమేననిపించింది. ఈరోజుల్లో కొత్తవాళ్ళ మీద ఒక కన్నేసి వుండటం అవసరమేననిపించింది. అందుకే ఈమధ్య ఇంట్లో వున్నప్పుడు మధ్య మధ్యలో వీధిలోకి తొంగి చూస్తున్నా.

ఇవాళ..సరిగ్గా అలా చూసినప్పుడే ఆ పిల్లాణ్ణి చూశాను. పదేళ్ళుంటయ్యేమో. ఇంటిముందున్న కారు కిందనుంచి ఏదో లాగుతూ కనిపించాడు.

'దొంగపిల్లాడేమో' అనుమానం. ఇంట్లోను, వీధిలోనూ కూడా ఎవరూ లేరు. వీధిలో మాత్రం 'గిన్నెలకు మాట్లేస్తాం, కళాయి పెడతాం' అని అరుచుకుంటూ ఒక ఆడ, మగ వెళ్తున్నారు.

బహుశా వీడుకూడా వాళ్ళ తాలూకాయేనేమో! ఏం తీస్తున్నాడో చూద్దామని అక్కడే ఆగాను. 'అయినా కారు కిందేముంటుంది చెత్త తప్ప. కొంపతీసి ఏ టెర్రరిస్టు తరఫునో బాంబేమన్నా పెడుతున్నాడా' నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది. అయినా చూద్దామని వాడికి కనబడకుండా నుంచున్నాను.

ఆ పిల్లాడు కారు కిందనుంచి ఒక చెప్పు తీశాడు. కొత్తదానిలాగే వుంది. పెద్దవాళ్ళదే. ఎవరిదోమరి. ఆ పిల్లాడు చెప్పుతీసుకుని ముందు వెళ్తున్నవాళ్ళ వెనకాల చెప్పుల్లేని కాళ్ళతో పరిగెత్తుతూనే "అయ్యా..అయ్యా.. చెప్పు..ఒకటే వుంది. రెండోది లేదు. చూసొస్తాను. ఆగయ్యా" అమాయక పసిహృదయం ఆగి ఆ చెప్పు కాలికి వేసుకుని సరదాపడుతోంది.

ఎండలో కాలికి చెప్పులన్నా లేకుండా పొట్టకూటికోసం వీధి వీధీ తిరుగుతున్న పసితనాన్ని చూసి నాగుండె నిట్టూర్చబోతుండగానే వాళ్ళ నాన్న అన్నాడు.

"అరేయ్, ఎన్నిసార్లు చెప్పాల్రా నీకు. అట్టా ఏం తేవద్దని!"

"నేనెవర్దీ తేలేదయ్యా. అగో ఆ కారు దగ్గర పడుంది" కారు వైపు చూపిస్తూ చెప్పుని కాలుతో పక్కకి నెట్టాడా పిల్లాడు.

"ఈడ కాదు. ఆడే పడేసిరా పో. అట్టా ఏం తేవద్దు. కట్టపడాల. తినాల" కొడుక్కి చెప్పేసి-

"మాటేస్తామమ్మా మాట్లు..గిన్నెలకి కళాయి పెడతాం" డ్యూటీలో దిగిపోయాడా తండ్రి.

తండ్రి మాటలకి మొహం చిన్నబుచ్చుకున్నా, ఆ చెప్పు తీసుకొచ్చి ఎక్కడనుంచి తీశాడో అక్కడే పడేసి తండ్రి వెనకే పరిగెత్తాడా పిల్లాడు.

ఆ నిజాయితీని చూసి ఆశ్చర్యపోయాను. గొప్ప పుట్టుకలు, కుటుంబ గౌరవాలు, కార్లు, మేడలూ లేకపోవచ్చు. వాళ్ళకే తెలియకుండా కష్టపడి బతికే బతుక్కే ఒక అర్థం కల్పించుకున్నారు వాళ్ళు.

మనసంతా ఒకవిధమైన సంతోషంతో, సంతృప్తితో నిండిపోయింది. అప్రయత్నంగా దేవుణ్ణి ప్రార్థించాను.

"దేవుడా, వాళ్ళని కాపాడు."

-పి.యన్.యమ్.లక్ష్మి (హైదరాబాద్)

## ఆర్.ఎస్.కృష్ణమూర్తి కథల పోటీ

ప్రముఖ తెలుగు కథా రచయిత ఆర్.ఎస్.కృష్ణమూర్తి పేరిట ప్రతి ఏటా నిర్వహిస్తున్న సంక్షిప్తకథల పోటీకి కథా రచయిత(త్రు)ల నుంచి ఎంట్రీలని ఆహ్వానిస్తున్నారు. జీవన వైవిధ్యానికి అద్దం పట్టేలా 20 పేజీలకి మించని కథల్ని పోటీకి పంపించాలి. ఒక రచయిత ఒక్క కథని మాత్రమే పోటీకి పంపించాలని నిర్వాహకులు ఆర్.ఉదయ్‌భాస్కర్ తెలియజేశారు. రచయిత(త్రు)లు పంపే కథలు ఇంతకుముందు ఏ పత్రికలోనూ ప్రచురితమైనవి కానీ, టీవీ/రేడియోల్లో ప్రసారం అయి ఉండకూడదు. పోటీకి పంపిన కథల్లో ఉత్తమమైనవాటిని ప్రముఖ రచయితల జ్యూరీ అవార్డులకి ఎంపికచేస్తుంది. మొదటి ఉత్తమ కథకు 3000రూపాయలు, రెండవ ఉత్తమ కథకు 2000రూపాయలు, తృతీయ ఉత్తమ కథకు 1000రూపాయలు నగదు బహుమతిగా అందజేస్తారు. ఆర్.ఎస్.కృష్ణమూర్తి జయంతి రోజైన జూన్ 6, 2003న ఈ బహుమతుల్ని అందజేస్తారు. పోటీకి పంపే రచనల్ని ఎస్.ఎస్.మూర్తి, 4-49, నాయుడుతోట బస్టాప్, వేపగుంట పోస్ట్, విశాఖపట్నం-47 చిరునామాకి మార్చి 31, 2003లోగా అందేటట్లు పంపించాలి.